## క్లుప్తంగా

### ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఓటరు చైతన్య కార్యక్రమంపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

**మెంటాడ (గజపతినగరం రూరల్):** ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలో ఓటర్లకు అవగాహన కలిస్తున్నామని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఓటుహక్కు ఆవశ్యకత, ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ గార తవుడు, తదితరులు ఉన్నారు.

### రూ.5.35 కోట్లతో తాగునీటి సదుపాయాల కల్పన

**వేపాడ:** మండలంలో రక్షిత మంచినీటి పథకం లేని 24 గ్రామాల్లో జేజేఎంపీ నిధులు రూ.5.35 కోట్లతో తాగునీటి సదుపాయం కలిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.ఆర్.వి పైడిరాజు తెలిపారు. మండలంలో కొండగంగుబూడి పంచాయతీలో కోటయ్యగరువు, బంగారయ్యపేట గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రక్షిత మంచినీటి పథకాలు లేని 24 గ్రామాల్లో రూ.5.35 కోట్లతో రక్షిత మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఉగాది పర్వదినం నాటికి అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

### బదిలీ ఎస్సైకి సన్మానం



ఎస్సై కిరణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

**గంట్యాడ:** స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన కె.కిరణ్‌కుమార్ నాయుడును స్టేషన్ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేశారని, సిబ్బందితో స్నేహపూర్వకంగా మెలిగేవారని కొనియాడారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు గణపతిరావు, శ్రీనివాస్‌రావు, శ్రీరాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

### 70 శాతం ధాన్యం సేకరణ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

**బొండపల్లి:** రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఆర్‌బీకే సిబ్బంది కృషిచేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. కనిమెరక గ్రామంలోని ఆర్బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ తాళ్లపూడి కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలానికి సంబంధించి ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంతవరకు 7800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని, 70 శాతం సేకరణ పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన ధాన్యంను సేకరించడంలో ఆర్బీకే సిబ్బంది, అధికారులు సహకరించాలని కోరారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్ కుమార్, వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్లు బండారు అప్పారావు, సుంకరి శ్రీనివాసరావు, పల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

### సస్యరక్షణపై అవగాహన

**లక్కవరపుకోట:** మండల కేంద్రంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణ వ్యవసాయ పని అవగాహన, అనుభవ, సస్యరక్షణ తదితర అంశాలపై శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.లక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆధునిక సాగు పద్ధతులు, యాజమాన్య పద్ధతులు, కలుపునివారణపై అవగాహన కల్పించారు.

### చందులూరులో పశువైద్య శిబిరం

**లక్కవరపుకోట:** మండలంలోని చందులూరు గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎల్.కోట పశువైద్య కేంద్రం వైద్యులు కె.గాయిత్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని సుమారు 40 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు.

# ఉత్సాహంగా క్రీడా పోటీలు



బొండపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎస్.కోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజవర్గాల్లోని అన్ని మండలాల కేంద్రాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. శుక్రవారం జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బహుమతులు అందజేశారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ క్రీడాకారులతో ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు



లక్కవరపుకోట: గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



జామి: మండల స్థాయి క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన అలమండ జట్టు



శృంగవరపుకోట: మండల స్థాయి కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ రఘురాజు



గజపతినగరం: క్రికెట్ పోటీ విజేత పురిటిపెంట-2 జట్టును అభినందిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

# వైభవంగా ధనుర్మాసోత్సవాలు



జామి: గోదాదేవి అమ్మవారి పల్లకిసేవలో భక్తులు



వేపాడ: పసుపు, కుంకుమా లంకరణలో వేంకటేశ్వరస్వామి



జామి: భీమసింగిలో అమ్మవారికి పసుపు దంచుతున్న భక్తులు

**వేపాడ:** మండల కేంద్రమైన వేపాడలో శ్రీదేవీ భూదేవి సమేత కళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్ఛరణలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**గోదాదేవికి కూడార్తై నివేదన**

**జామి:** మండలంలో ఎ.ఆర్.పేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి 108 గిన్నెలతో కూడార్తై పాయసం నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ నిర్వహించారు.

**పెళ్లి కుమార్తెగా గోదాదేవి**

**జామి:** మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవి అమ్మవారిని పెళ్లి కుమార్తెగా, స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరణోత్సవం వైభవంగా జరిగింది. ముత్తైదువులతో పసుపు దంచు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

**వేపాడ:** మండలంలో అన్ని పంచాయతీల్లో నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఇళ్ల స్థలాల కోసం వచ్చిన అర్జీలకు సంబంధించి ఆరు దశల వెరిఫికేషన్ పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో 5700 మందికి జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అలాగే సొంత స్థలాలు ఉన్న 4వేల మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ అర్జీలు ఇచ్చిన వారికి ఇళ్ల స్థలాల కోసం స్థల పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 29న వేపాడలో జరిగే వైఎస్సార్ ఆసరా, వచ్చే నెలలో జరిగే చేయూత కార్యక్రమాలను విజయవంతం చేయాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చినరాము నాయుడు, వైస్ ఎంపీపీ అడపాఈశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.ఉమా, తహసీల్దారు ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చీపురుపల్లి రూరల్:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. మండలంలోని రావివలస సచివాలయం పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు సుపరిపాలనను గ్రామస్థాయికి తీసుకెళ్లిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సుపరిపాలన ఇదే విధంగా కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బద్దుకొండ మణిదీప్, కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు, ఇప్పిలి తిరుమల, గవర బలరాం, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రూ.98 లక్షలతో ఇంటింటికీ తాగునీరు



ఇంటింటికీ కుళాయిలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

**గుర్ల:** ఇచ్చిన మాట ప్రకారం పాలవలస గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పాలవలసలో జలజీవన్ మిషన్ కింద రూ.98 లక్షలతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి పనులను, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన కళావేదికను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలోని అర్హులకు సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.14 లక్షలు అందించడం జరిగిందన్నారు. శ్మశానవాటికకు రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, తహసీల్దార్ పద్మావతి, ఈఓపీఆర్డీ గాయత్రి పాల్గొన్నారు.

**ప్రతీ గడపకు తాగునీరు**

**శృంగవరపుకోట:** రాష్ట్రంలో ప్రతీ గడపకు రక్షిత నీరు అందించాలన్న మహత్తర సంకల్పంతో జగనన్న సర్కారు పనిచేస్తోందని ఎమ్మెల్సీ రఘురాజు చెప్పారు. చిట్టంపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ కింద రూ.7.50 లక్షలతో ఏర్పాటుచేసిన ఇంటింటి తాగునీటి కుళాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గతంలో గిరిజన గ్రామాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి బాట పడుతున్నాయని అన్నారు. గ్రామంలో 44 ఆవాసాలకు సురక్షిత తాగునీరు అందిస్తున్నామన్నారు.

**తాగునీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన**

**చీపురుపల్లి రూరల్:** మండలంలోని మెట్టపల్లి గ్రామంలో తాగునీటి బోరు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు లక్ష రూపాయలతో తాగునీటి బోరు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మీసాల పైడితల్లి పాల్గొన్నారు.

### సంక్రాంతి సరుకుల స్టాల్ ప్రారంభం

**కొత్తవలస:** మండల కేంద్రంలోని వైకేపీ భవనం వద్ద మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో సంక్రాంతి పండగకు అవసరమైన సామగ్రిని విక్రయించే స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ శుక్రవారం ఈ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ స్టాల్‌లో భోగి పిడకలు, నలుగు పిండి, వేప పుల్లలు, పిండి వంటలు, సేంద్రియ ఎరువులతో సాగుచేసిన కూరగాయలు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఏపీఎం ఎ.వెంకటరమణ చెప్పారు. ఎంపీడీఓ వై.పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, సర్పంచ్ ఎం.రామస్వామి, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు పాల్గొన్నారు.

### మహిళా మార్ట్‌లో లక్కీడ్రా

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి చేయూత మహిళా మార్ట్‌లో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావుల చేతులు మీదగా శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా మహిళా మార్టులో రూ.2 వేలకు పైగా కొనుగోలు చేసిన వారికి లక్కీడ్రా నిర్వహించారు. ఈ డ్రాలో విజేతలైన ముగ్గురికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ మార్టులు ఉపయోగపడతాయని అన్నారు.

## 1600 మందికి శాశ్వత భూహక్కు

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడు జగన్
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**మెంటాడ(గజపతినగరం రూరల్):** గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఇవ్వని శాశ్వత భూహక్కు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో 1117 మందికి 539 ఎకరాలు, రెండో విడతలో 492 మందికి 194 ఎకరాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 733 ఎకరాలను 1600 మందికి భూహక్కు కల్పిస్తూ పట్టాలను అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుంటే.. ప్రతిపక్ష నేతలు హేళన చేసి పేదల అభివృద్ధికి అడ్డుతగులుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడాలను ప్రజలు బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, సామంతులు పైడిరాజు, మండల సురేష్, మాజీ జెడ్పీటీసీ ముక్కువ శ్రీధర్, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిప్రదాత వివేకానందుడు

భారతదేశ గొప్పతనాన్ని, సోదర భావాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వామీ వివేకానందుడు. ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత వివేకానందుని బోధనల నుంచి స్ఫూర్తిని పొందాలని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివేకానంద జీవితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జామి: భీమసింగిలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ సతీష్



వేపాడ: జగ్గయ్యపేటలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువకులు, చిన్నారులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్, తదితరులు



లక్కవరపుకోట: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు



శృంగవరపుకోట: పట్టణంలోని మోక్షవిద్య యోగా మందిర్‌లో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు



చీపురుపల్లి: ఆశయ సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు

## ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మొదటి విడత కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రస్తుతం రెండో విడత వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నిపుణులైన వైద్యులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మందులు అందిస్తున్నారు. ఎస్.కోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. దత్తిరాజేరు మండలం కె.కృష్ణాపురంలో జరిగిన సురక్ష–2 క్యాంప్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



దత్తిరాజేరు: కె.కృష్ణాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



బొండపల్లి: కనిమెరకలో రోగులకు మందులు అందచేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, వైద్య సిబ్బంది



గంట్యాడ: నరవ గ్రామంలో మహిళకు కళ్లద్దాలు, మందులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి



శృంగవరపుకోట: ధర్మవరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

## సంక్రాంతి సంబరాలు




చీపురుపల్లి: రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు



చీపురుపల్లి: శ్రీనివాస జూనియర్ కళాశాలలో భోగి సందడి

**చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్:** పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల, సత్యారామ డిగ్రీ కళాశాల, గరివిడి అవంతీ ఇంజినీరింగు కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రాలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగవల్లులు, భోగి మంటలు వేసి సందడి చేశారు. సత్యారామ కళాశాలలో వివేకానంద జయంతి ఉత్సవాలను నిర్వహించారు.



చీపురుపల్లి రూరల్: అవంతి కళాశాలలో భోగి మంట వద్ద అధ్యాపకులు, విద్యార్థుల సంబరాలు